ప్రజాశక్తి







## లబ్ధిదారులకు దుకాణాలు కేటాయింపు

**ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ :** కార్పొరేషన్ పరిధిలోని మైపాడు గేటు రోడ్డు, జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న "స్మార్ట్ స్ట్రీట్ బజార్" ప్రాజెక్టులో 120 దుకాణాలను లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు శుక్రవారం కేటాయించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయములోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ వెండింగ్ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా లాటరీ విధానాన్ని లబ్ధిదారుల సమక్షంలో అమలు చేశామని మెప్మా పి.డి లీలా రాణి తెలిపారు. కార్పొరేషన్ సెక్రటరీ శ్రీలక్ష్మి, ట్రాఫిక్ సి.ఐ లు రామకష్ణ, వెంకటరెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫీసర్ ప్రణతి ఫోరా, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, మెప్మా సిబ్బంది ఉన్నారు




లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తున్న అధికారులు

# 'కుబేరా' బాధితులకు నోటీసులు..!

### రికవరీ ప్రయివేటు ఏజెన్సీకి అప్పగింత -పోలీసుల విచారణ సాగుతోంది ..

**నెల్లూరు యాక్సెస్ బ్యాంక్‌లో భారీ దోపిడీకి పాల్పడిన కుబేరా కేసు విచారణ నత్తనడకన సాగుతోంది.జులై 20న "కుబేరా నెల్లూరు" పేరుతో 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనం సంచలనం కలిగించింది.. పోలీసులకు ఉన్న పని ఒత్తిడిలో ఈ కేసు సాగుతూనే ఉంది..బ్యాంక్ అధికారులు గతంలో ఏడు నెలల క్రితం ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలిసిందే. సుమారు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఈ కేసు ఒక కొలిక్కిరాలేదు..అత్యంత నిరుపేదలకు జరిగిన అన్యాయంపై ఎవరూ నోరు మెదపడం లేదు..యాక్సెస్ బ్యాంక్ సిబ్బంది, ఉద్యోగులు ప్రోత్సాహంతోనే ఈ భారీ కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. ఓ వైపు కేసు సాగుతుండగా యాక్సెస్ బ్యాంక్ బాధితుల నుంచి రికవరీ చేయడానికి చెన్నయ్‌లోని ఓ ప్రయివేటు ఏజెన్సీతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బాధితులకు నోటీసుల మీద నోటీసులు అందిస్తున్నారు. బాధితులు లబోదిబో అంటున్నారు. పోలీసులు మాత్రం కేసు విచారణలో ఉందని చెబుతున్నారు..**

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :** నెల్లూరు యాక్సెస్ బ్యాంకు కుంభకోణంతో తప్పుచేసిన వారు దర్జాగా తిరుగు తుండగా, బాధితులు లబోదిబో అంటున్నారు. జులై 20వ తేదీ ఈ విషయం బయటకొచ్చిన విషయం తెలిసిందే. అంతకు ముందు ఏడు నెలల క్రితం బ్యాంక్ అధికారులు ముత్తుకూరు బ్యాంక్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ కుంభకోణంలో టెక్నాలజీని ఉపయోగించుకొని ఈ వ్యవహారం జరిగింది. ఇటీవల ఆర్‌బిఐ నూతన నిబంధనలు తీసుకొచ్చింది. అదే డిజిటల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం. ఇందులో ఏ వ్యక్తులకూ సంబంధం లేకుండా నేరుగా టెక్నాలజీ ఉపయోగించుకొని బ్యాంకుల్లో నగదు కొట్టేయొచ్చు. అదే యాక్సెస్ బ్యాంక్‌లో జరిగింది. కేవలం ఒక్క యాక్సెస్ బ్యాంక్‌లోనే ఈ కుంభకోణం జరిగినట్లు తెలిసింది. నెల్లూరు నగరంలోని నలుగురు వ్యక్తులు ఈ వ్యవహారానికి నాందిపలికారు. 1. జాలే వాసుదేవ నాయుడు 2. అల్లాభక్ష్ 3. శివకుమార్ 4. వెంకటేష్ ఫేక్ సాఫ్ట్‌వేర్ కంపెనీల పేరుతో ఈ మోసానికి పాల్పడి నట్లు గుర్తించారు. 1. అవి నెట్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్.. 2. ఎంఆర్ ఇన్ఫ్రా లైన్, 3. గ్లోబల్ సొల్యూషన్ 4. క్యాపిటల్ ట్రీ స్టాఫ్ వేర్ కంపెనీల పేరుతో ఈ తతంగా నడిపిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాపితంగా అమాయక ప్రజలను ఉపయోగించుకొని చేశారు. ఒక్కో వ్యక్తి ఖాతాల్లో రూ.14 లక్షల నుంచి రూ.1.35 కోట్ల మేరకు భారీ మొత్తంలో కాజేసిన విషయం తెలిసిందే..



Kovise Foundation Conflict Resolution International

(Under the aegis of KOVE GLOBAL)

DATE: 06.06.2025

Mr./Ms. CHALAMCHARLA LAKSHMI NARAYANA

Subject: APPOINTMENT OF SOLE ARBITRATOR

For Kovise Foundation Conflict Resolution International

లక్ష్మీనారాయణకు జారీ చేసిన నోటీసులు

**బాధితులకు నోటీసులు..!**

కుబేరా కేసు బయటకు రావడంతో తమకు న్యాయం జరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్న బాధితులకు ఇప్పుడు మరింత కష్టం వచ్చిపడుతోంది. తమకు ఏ మాత్రమూ సంబంధం లేకుండా, తమవారి పేరుపై కోట్ల రూపాయలు కొల్లగొట్టారని అటు బ్యాంకు అధికారులుకు, ఇటు పోలీసులకు తెలుసు. అయినప్పటికీ బాధితుల గోడు బ్యాంక్ అధికారులు పట్టించుకోవడం లేదు. తమకు తెలియదని, బకాయిలు చెల్లించాలంటూ పెండింగ్ పెడుతున్నారు. నెల్లూరు బ్యాంక్ అధికారులు 56 మంది జాబితా ఇచ్చి, కేసు నమోదు చేశారు. వీరు కాకుండా వందల సంఖ్యలో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. తాజాగా చెన్నయ్‌కు కోవిస్ ఫౌండేషన్ కంప్లెటిక్ రిలివేషన్ ఇంటర్ నేషనల్ కంపెనీ పేరుతో విడవలూరుకు చెందిన చలంచర్ల లక్ష్మీనారాయణకు నోటీసులు పంపుతున్నారు. ఇప్పటి మూడు నోటీసులు జారీ చేశారు. యాక్సెస్ బ్యాంక్‌లో రూ.14.90 లక్షలు రుణం తీసుకున్నారని, తిరిగి చెల్లించాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు. జిల్లా వ్యాపితంగా బాధితులందరికీ ఇలాంటి నోటీసులు అందు తున్నట్లు తెలుస్తోంది. యాక్సెస్ బ్యాంక్ తన సిబ్బంది పాత్రపై ఇప్పటి వరకు నోరు మెదపడం లేదు..

**సా...గుతోన్న పోలీసుల విచారణ ..!**

యాక్సెస్ బ్యాంక్ కుంభకోణం ఎనిమిది నెలల క్రితమే బయటకొచ్చిన విషయం తెలిసిందే. నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ మేనేజర్ మధన్‌మోహన్‌రావు 2024 డిసెంబర్ 12న ముత్తుకూరు పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 179-2014 పేరుతో కేసు నమోదు చేశారు. జులై 20 నుంచి పోలీసు శాఖ ఈ కేసులో విచారణ మొదలు పెట్టింది. బ్యాంక్ అధికారులు, 56 మంది బాధితుల వివరాలతోనే విచారణ జరుపుతున్నారు. ఒక్కో బాధితుని నుండి 160 పేజీల రిపోర్టు తయారు చేస్తున్నారు. నెల్లూరు రూరల్ డిఎస్‌పి ఈ కేసును విచారిస్తుండగా, ఇటీవల నెల్లూరు జరిగిన అన్ని కేసులను ఆయనే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కుబేరా కేసు ఆలస్యం అవుతుందని తెలుస్తోంది. ఈ కేసులో జనం డబ్బులు కాజేసి వ్యక్తులు పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు. విచారణ జరుగుతుందని సప్త సముద్రాల బయట ఉన్న పట్టకొస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు. బాధితులకు మాత్రం లబోదిబో అంటున్నారు...



## కంప్యూటర్ బహూకరణ

**ప్రజాశక్తి-కందుకూరు :** త్వరలో నెల్లూరు జిల్లా పోలీసు శిక్షణా కళాశాల లో ప్రారంభం కాబోతున్న పోలీస్ కానిస్టేబుల్ శిక్షణలో భాగంగా కానిస్టేబుళ్లకు సైబర్ క్రైమ్ పై అవగాహన, నూతన సాంకేతికత పై శిక్షణ ఇచ్చే కార్యక్రమంలో భాగంగా బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల తరపున అధునాతన కంప్యూటర్ ను కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఎస్.ఐ బి.మహేంద్రకి అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

## కమిషనర్ నందన్ స్టడీ టూర్

**ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ :** స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్దేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అమలుకై వివిధ అంశాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర మున్సిపల్ కమిషనర్లకు తెలంగాణ - తమిళనాడు ప్రాంతాలలో ఐదు రోజుల స్టడీ టూర్ ను నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా తమిళనాడు, చెన్నై పట్టణంలోని సి అండ్ డి ప్లాంట్, బయో మైనింగ్ ప్లాంట్, డోర్ టు డోర్ కలెక్షన్ విధానం, సత్యవేడులోని చికెన్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ లలో బంద సభ్యులతో కలిసి కమిషనర్ వై.ఓ నందన్ పాల్గొని వివిధ అంశాలపై అధ్యయనం చేశారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-నెల్లూరు :** విద్యారంగంలో నెలకొన్న సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వి.ఆర్.సి క్రీడా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నా అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చూపించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ చలో కలెక్టరేట్ కార్యక్రమాలు నిర్వహిస్తుందనాన్రు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 14 నెలలు గడిచిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.6400 కోట్ల మేర ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు.తక్షణమే జిఒ నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.3,000 మెస్ చార్జీలు పెంచాలని హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి. విక్రమ్, వెన్ను నరేంద్ర జిల్లా కమిటీ సభ్యులు విష్ణు, నాగేంద్ర,దివేశ్ జిల్లా నాయకులు మస్తాన్, సుకుమార్, సంతోష్, ఖాదర్ బాషా, దావూద్, జీవన్ తదితర నాయకులు పాల్గొన్నారు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి-నెల్లూరు :** స్థానిక బాలాజీనగర్ ప్రాంతంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించబోయే ఉచిత కంటి వైద్య శిబిరంలో ప్రజలు పాల్గొని సద్విని యోగం చేసుకోవాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహా, సిపిఎం శాఖ కార్యదర్శి బొమ్మ శ్రీధర్, స్థానిక కమిటీ కార్యదర్శి శేఖర్ పేరొక్కన్నారు. శుక్రవారం డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లోని డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటుకు సంబంధించిన వివరాలు మీడియాకు వెల్లడించారు. నాయకులు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యా వైద్యం అనేది పేద మధ్య తరగతి ప్రజలకు అందని ద్రాక్ష మాదిరిగా మారిపోతుందన్నారు. ఇటువంటి తరుణంలో పేద ప్రజలకు వైద్యం అందించాలని సంకల్పంతో ప్రతి సంవత్సరం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారి సహకారంతో కొంతమంది దాతల సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. డివైఎఫ్ఐ స్థానిక కమిటీ సభ్యులు అన్వర్ భాష ఉన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

## వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి : సిపిఎం

**ప్రజాశక్తి -గుడ్లూరు :** అర్హులైన వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం దారుణమని గుడ్లూరు మండలం సిపిఎం కన్వీనర్ జి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుడ్లూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో సిపిఎం సీనియర్ నాయకులు మద్దిశెట్టి జాలయ్య అధ్యక్షతన వికలాంగులు పింఛన్లు రద్దు చేయడంపై సమావేశం నిర్వహించారు. గుడ్లూరు మండలంలో 97 మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేశారని, వారంతా అర్హులేనన్నారు. పింఛన్లు రద్దు చేయడం వల్ల దివ్యాంగులు జీవనం కష్టతరంగా మారిందన్నారు. అర్హులైన వికలాంగుల పింఛన్లును వెంటనే తిరిగి పునరుద్ధరించాలని జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఎం కార్యదర్శులు కొట్టే వెంకయ్య గుత్తి మల్లికార్జున సీనియర్ సిపిఎం నాయకులు మద్దిశెట్టి జాలయ్య దామ కష్ణయ్య ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## కాకాణిని కలిసిన కార్పొరేటర్ నాగార్జున

**ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని నెల్లూరు సిటీ 13వ డివిజన్ కార్పొరేటర్, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం శాలువాతో కాకాణిని సత్కరించారు. కాకాణజ గోవర్ధన్ రెడ్డి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయటానికి ప్రజాక్షేత్రంలోకి అడుగు పెట్టడం సంతోషకరమని నాగార్జున అన్నారు.

## పిడిఎస్‌యు ధర్నా

**ప్రజాశక్తి-నెల్లూరు :** ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న జూనియర్ కాలేజీలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు నగర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదటు పిడిఎస్‌యు నగర కమిటీ ధర్నా కార్యక్రమం చేపట్టింది. జిల్లా అధ్యక్షులు ఎం సునీల్ . టౌన్ అధ్యక్ష కార్యదర్శులు కె ఆశిర్ . ఎస్కే ఖాదర్ మస్తాన్. సభ్యులు నవీన్. ఇఫ్రాన్. ఇఫ్రాన్. తారీక్. తదితరులు పాల్గొన్నారు



ఉద్యోగాలకు ఎంపికైన ప్రకాశం విద్యార్థులు

## 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

### స్మార్ట్‌బ్రెయిన్స్ టెక్నాలజీస్‌లో 17 మందికి ఉద్యోగాలు

**ప్రజాశక్తి-కందుకూరు**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటుకున్నారు. శిక్షణ,నియామక విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రైవ్‌లో ప్రముఖ ఐటీ సంస్థ స్మార్ట్‌బ్రెయిన్స్ టెక్నాలజీస్ విద్యార్థులను ఎంపిక చేసింది. గ్రూప్ డిస్కషన్, వన్ టు వన్ ఇంటర్వ్యూ రౌండ్ల అనంతరం మొత్తం 17 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల కెరీర్ ఎదుగుదల మా ప్రధాన లక్ష్యం. పరిశ్రమల అవసరాలకు తగ్గ శిక్షణ అందించడంలో తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రతి సంవత్సరం జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు మా క్యాంపస్‌కు రావడం ప్రమా ణాలపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఈ విజయవంతమైన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కషి చేసిన ఇనిస్టిట్యూట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వడ్డి విక్రం రెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన కషి వలననే మా విద్యార్థులకు ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశాలు లభిస్తున్నాయన్నారు.ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశం ఇంజినీరింగ్ విద్యార్థులు ప్లేస్‌మెంట్లలో సాధిస్తున్న విజయాలు గర్వకారణమన్నారు. ఇది విద్యార్థుల కషి, అధ్యాపకుల అంకితభావం, నిర్వహణ దూరదష్టి కలయిక ఫలితం. రాబోయే రోజుల్లో మరిన్ని కంపెనీలను తీసుకురావడానికి కషి చేస్తామని వివరించారు.ఈ డ్రైవ్‌ను ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్స్ సహిత్య, సుమలత, భారద్వాజ్, అకడమిక్ ఇన్‌చార్జ్ షేక్ నాగుల మీరవలి సమన్వయం చేసి విజయవంతం చేశారు.

# హోదా పెరిగినా .. అవే వసతులు ..!

○పశుసంవర్ధక శాఖ ఎడి కార్యాలయంలో మెరుగుపడని సేవలు

○పశుపోషకులకు ఇక్కట్లు ○శిథిలావస్థకు చేరిన వైద్యశాల

○ నూతన భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి

**ప్రజాశక్తి - వలేటివారిపాలెం**

మండలకేంద్రంలోని పశు వైద్యశాల స్థాయి నుంచి సహాయ సంచాలకుల కార్యాలయం హోదా సాధించింది.. అయినప్పటికీ సాధారణ పశువైద్యశాలలో ఏవైతే వసతులు ఉన్నాయో ఎడి కార్యాలయంగా హోదా పెరిగినప్పటికీ అదే వసతులు ఇక్కడ ఉన్నాయి. భవనం కూడా శిథిలావస్థకు చేరింది. అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం కు తగినట్లుగా అన్ని వసతులు ఉన్న భవనాన్ని మంజూరు చేయాలని పశు పోషకులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వలేటివారిపాలెం ఏరియా పశు వైద్యశాల కార్యాలయం పరిధిలో లింగసముద్రం, వలేటివారి పాలెం మండలాలు ఉన్నాయి. ఎడి కార్యాలయం పరిధిలో పాడి గేదెలు, గొర్రెలు, మేకల మీద ఆధారపడి జీవనం సాగించే పశుపోషకులు ఇక్కడ అధికంగానే ఉన్నారు. సమావేశాలకు స్థలం కరువు. ఈ రెండు మండలాల పరిధిలో పశువైద్యశాల డాక్టర్ స్థాయి కలిగిన డిస్పెన్సరీలు 5 ఉన్నాయి. లింగసముద్రం మండలం పరిధిలో చినపవని, వీఆర్ కోట, లింగసముద్రం ఉండగా.. వలేటివారిపాలెం మండలం పరిధిలో పోకూరు, వలేటివారిపాలెం పశు వైద్యశాలలు ఉన్నాయి. లింగసముద్రం మండలంలో లింగసముద్రం, పెద్దపవని గ్రామాల్లో రెండేసి సచివాలయాలు ఉండగా మండలం మొత్తం మీద 13 సచివాలయాలు ఉన్నాయి. వలేటివారిపాలెం మండలంలో 15 సచివాలయాలతో కలిపి రెండు మండలాల పరిధిలో మొత్తం 28 సచివాలయాలు ఉన్నాయి. 28 సచివాలయాల పరిధిలోని పశువైద్య సిబ్బంది, డాక్టర్లకు ప్రతినిత్యం ఏడీ కార్యాలయంలో అవగాహన సమావేశాలు నిర్వహిస్తుంటారు. అదేవిధంగా వలేటివారిపాలెం పశువైద్యశాలకు వచ్చే పశుపోషకులు ఏదైనా సమస్యపై కార్యాలయానికి వస్తే కనీసం కూర్చునేందుకు కూడా తగు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశుపోషకులకు సిబ్బంది మందులు ఇచ్చేదాకా ఒంటికాలిపై నిలబడాల్సి వస్తోందని పశు పోషకాలు ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా ఏడీ కార్యాలయంలో పశువైద్య సిబ్బందికి అవగాహన సమావేశాలు సైతం నిర్వహిస్తుంటారు. వీరంతా కూర్చునేందుకు సమావేశపు హాలు లేక సిబ్బంది ఇబ్బందులెద ుర్కొంటున్నారు. నూతన భవనం మంజూరు చేయాలి.!లి రెండు మండలాల పశుపోషకులకు కావలసిన మందులు, టీకాలు, ఇతర పశు వైద్య మెటీరియల్ అంతా వలేటివారిపాలెం ఎడి కార్యాలయానికి స్టాక్ వస్తుంది. ఇక్కడ నుండే ఐదు డిస్పెన్సరీ లకు వైద్యులు మందులను తీసుకెళ్లాల్సి ఉంది. మందులు స్టాక్ చేసుకునేందుకు ఒక గది కూడా సరిగా ఇక్కడ అందుబాటులో లేదు. పశువైద్యశాల భవనం ప్రారంభంలో ఒక చిన్న గది మాత్రమే ఉంది. రెండు మండలాలకు సరిపడా వచ్చిన ముందులు స్టాక్ చేసుకునేందుకు కూడా ఆ చిన్న ఇరుకు గదిలోనే ఒకదానిపై ఒకటి పడవేస్తున్నారు. పశుపోషకులకు అవసరమైన మందులు ఇవ్వాలంటే కూడా ఇక్కడ కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. దీనికి తోడు పశు సంచార వాహనం కూడా ఈ కార్యాలయంలోనే ఉంది. ఇక్కడ నుండే సంచార వాహనం గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. పశుపోషకుల ఇక్కట్లను దష్టిలో ఉంచుకొని పశువైద్య శాఖ ఉన్నతాధికారులు వలేటివారిపాలెం ఏడీ కార్యాలయానికి తగినట్లుగా నూతన భవనం మంజూరు చేయాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# తీర ప్రాంత భద్రతపై అవగాహన

**ప్రజాశక్తి -ఉలవపాడు :** మండలంలోని చాకిచెర్ల పెద్దపట్టపు పాలెంలో రామాయపట్నం సిఎస్‌పిఎస్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సర్పంచి, పెద్దల సమక్షంలో సముద్ర తీర ప్రాంత భద్రతపై సామాజిక అవగాహన సదస్సు జరిగింది. సిఐ జి. శ్రీమన్నారాయణ హాజరై మాట్లాడారు. సముద్రంలో వేటకు వెళ్ళినప్పుడు కొత్త వ్యక్తులు బోట్లు కనిపిం చినా, ఆపద ఎదురైనా వెంటనే పోస్టల్ సెక్యూరిటీ టోల్ ఫ్రీ నెంబర్ 1093కి, కోస్ట్ గార్డ్ టోల్ ఫ్రీ నెంబర్ 1554 తెలియజేయాలన్నారు. బోట్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వేటకు వెళ్లేటప్పుడు లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్‌ని విధిగా తీసుకెళ్లాలని సూచించారు.. సముద్ర మార్గం ద్వారా దేశంలోకి టెర్రరిస్టులు, ఉగ్రవాదులు ప్రవేశించకుండా, అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా నివారించడానికి మత్స్యకారులు కోస్టల్ సెక్యూరిటీ పోలీ సులకు సహకరించాలన్నారు. కడలూరు బోట్స్ సమస్య గురించి మత్స్యకారులు తెలపగాఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకళ్తామని తెలిపారు. ఎస్.ఐ పి ఈశ్వరయ్య, రామాయపట్నం సి ఎస్ పి ఎస్ చాకిచెర్ల పట్టపాలెం సర్పంచి ఏ. జయరాం, కే బ్రహ్మనాయుడు ఎఫ్ ఎస్ ఓ ,చాకిచెర్ల పెదపట్టపాలెం సచివాలయం సిబ్బంది సి.హెచ్ కళ్యాణ్ రావు, డి మహేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ టి రాజేష్, పి వంశి యాదవ, మత్స్యకార సంక్షేమ సమితి కార్యదర్శి తూపిరి రవి , గ్రామ కాపులు ఆవుల చిన్న గోవిందు, పి శ్రీనివాసులు ఉన్నారు.



మాట్లాడుతున్న సిఐ

## విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : డిఎస్‌పి

**ప్రజాశక్తి-కందుకూరు**

ఎస్‌పి ఉత్తర్వుల మేరకు కందుకూరు డిఎస్‌పి బాల సుబ్రహ్మణ్యం వినాయక చవితి సందర్భంగా కందుకూరు సబ్-డివిజన్ ప్రజలకు, ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తల పై శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో పలు సూచనలు చేశారు.వినాయక విగ్రహాలు,మండపాల ఏర్పాటు సందర్భంగా పాటించాల్సిన నియమాలు వివరించారు. పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో రూపొందించిన విగ్రహాలు కాకుండా సహజసిద్ధంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపిపారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠ పందిళ్ళు,మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుగా పోలీస్ అనుమతి తప్పనిసరగా తీసుకోవాలన్నారు. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం , విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా పోలీస్‌లకి తెలపాలని అయన తెలిపారు.



## వికలాంగులకు భోజనం

**కందుకూరు:** శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ వరసిద్ధి వినాయక ఫైర్ వర్క్స్ యజమాని తానికొండ ప్రవీణ్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో ఏర్పేడు పాపానాయుడుపేటలోని లక్ష్మీ నరసింహ మానసిక దివ్యాంగుల అనాధ ఆశ్రమంలోని వారికి 4 భోజనం టేబుల్స్ బహూకరించారు. వారి మధ్య కేక్ కట్ చేసి వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవా హదయ రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు.

## అంగన్‌వాడీల మానవహారం

**ఉలవపాడు :** అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మండల కేంద్రమైన ఉలవపాడులో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐ సి డి సి ప్రాజెక్టు కార్యాల యం వద్ద నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. సి. హెచ్ ఇంద్రావతి, లతా రెడ్డి, బుజ్జమ్మ, పద్మజ ,కోటేశ్వరి, గీత, మార్తమ్మ ఉన్నారు.



## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా ఆపన్నహస్తం అందిస్తూ ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శ్రుకవారం నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని 26 మంది అనారోగ్య పీడితులకు రూ 32 లక్షల 2 వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 14 నెలల వ్యవధిలో కోవూరు నియోజకవర్గంలో 14 విడతలుగా 262 కుటుంబాలకు రూ 3 కోట్ల 13 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలిపారు.కోడూరు కమలాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ కోవూరు మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, బుచ్చి టిడిపి అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, ఇందుకూరు పేట మండల టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రావెళ్ల వీరేంద్ర నాయుడు, పాశం శ్రీహరి రెడ్డి, యాకసిరి వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి-కందుకూరు :** పట్టణంలో ప్రశాంతి నగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం కందుకూరు మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించారు. కందుకూరు మానవత శాఖ చైర్మన్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మానవత ఆధ్వర్యంలో చెట్లు నాటడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, రక్తదానం చేయడం, ఆపదలో ఉన్న వారికి సాయం అందించడం మానవత యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు మానవత ప్రెసిడెంట్ గుర్రం చిన్న అల్లురయ్య, మానవతా సభ్యులు గౌస్, శివశంకర్, కోటా కిషోర్, రమేష్, వేణు, కంసాని మయూరి ఉన్నారు.

## అన్న క్యాంటీన్‌లో పరిశీలన

**ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు రామలింగాపురం కూడలిలోని అన్న క్యాంటీన్ పరిశీలించారు. క్యాంటీన్లో ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యత, ప్రమాణాలను తనిఖీ చేశారు. నిర్దేశించిన మోతాదు నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు మూడు పూటలా అందించాలని సూచించారు.

## చిరంజీవి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-కందుకూరు :** పట్టణంలోని పడమటి బలిజ పాలెంలో మెగా స్టార్ చిరంజీవి జన్మ దిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానులు పెద్ద ఎత్తున భానాసంచా కాలిచి , కేకును కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. శిగా శ్రీను , ఏకాబరం విశ్వనాథ్, శేటి కొండయ్య, గోకరాజు మాధవరావు , శ్రీను, మేకల నరసింహారావు, శ్రీరామ్, సాకిరి సాయి చందు నాయుడు, తేజ, శిగ తిరుపాలు, పంది వంశీ, దారం మహి నాయుడు, శీగా భూపతి, నవీన్ ఉన్నారు.

## 22 కేజీల గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి -నెల్లూరు సంక్షేమం :** 22.5 కేజీల గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను నెల్లూరు రైల్వే స్టేషన్లో రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్ఆర్పి జి. మురళీధర్ మాట్లాడుతూ పట్టుబడ్డ నిందితులు పళని రాజేష్ , జబునీషా. ఈ ఇద్దరిని చెన్నయ్ వాసులుగా గుర్తించామన్నారు. పట్టుబడ్డ నిందితులు ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో ఒరిస్సా నుండి చెన్నయ్‌కు వెళ్తూ నెల్లూరు స్టేషన్లో దిగి చెన్నయ్‌కు టికెట్ కొనిక్కుని వేచి ఉండగా అనుమానాస్పద స్థితిలో పోలీసులకు దొరికారన్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను రైల్వే ఏడిఈఎన్ నెల్లూరు గెజిటెడ్ అధికారి మధ్యవర్తుల సమక్షంలో తనిఖీలు చేశామన్నారు. వారి వద్ద నుండి 12 ప్యాకెట్లు గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ సుమారుగా 4.5 లక్షల రూపాయలు అంచనా వేయబడింది అని చెప్పారు. వారి వద్ద నుండి మొబైల్ ఫోన్లు, ఆధార్ కార్డులు, రైలు టికెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడంలో భాగంగా డీఐజీ సత్య యేసు బాబు, ఎస్ఆర్పి గుంతకల్ రాహుల్ మీనా ఆదేశాల మేరకు డిఎస్ఆర్పి జి.మురళీధర్ మార్గదర్శకాలతో రైల్వే సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ.సుధాకర్ నేతృత్వంలో ఆర్పిఎస్పై హరిచందన, ఆర్పిఎఫ్ ఎస్ఐ శివరూపవత్, జిఆర్పి టి.జయ ప్రకాష్, ఏ.మణికంఠ, ఏపీఎస్పీ వి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

# కార్మికుల కోసం సిఐటియు పోరాటం

**ప్రజాశక్తి-కావలి**

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు అలుపెరుగని పోరాటం చేస్తుందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య పేర్కొన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అనుబంధ పట్టణ మున్సిపల్ కార్మికుల నాలుగవ మహాసభ షాదీ మంజిల్‌లో తురక సీనయ్య, ఎల్.రాజ్యలక్ష్మిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, గత ప్రభుత్వం కార్మికులకు అనేక హామీలను ఇచ్చి,అమలు చేయ లేదని, ఇప్పటికీ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కార్మికులను ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పగించాలని చూస్తున్నదన్నారు. ఇది చాలా దుర్మార్గమని, ఇటీవల నెల్లూరులో కార్మికులను కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించి కార్మికులు విజయం సాధించారన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలు కొనసాగించాల ని కూటమి ప్రభుత్వం కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా నిర్దాక్షిణంగా ఇంటికి పంపుతుందని ఇది చాలా బాధాకరమన్నారు. వయస్సు పరిమితి పేరుతో తొలగించిన కార్మికుల పిల్లలను ఆప్కాస్‌లో నియమించడం లేదని, మున్సిపల్ కార్మికుల అందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికులు పోరాడుతున్నారన్నారు. కార్మికులను ఉద్యోగులను చూపిస్తున్నందున సంక్షేమ పథకాలు అందడం లేదని ఉద్యోగులని మాటను రాష్ట్ర ప్రభుత్వం తొలగించా లన్నారు. సంక్షేమ పథకాలు కార్మికులకు కొనసాగించాలని కార్మికుల సమస్యలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కె.రెహానా బేగం మాట్లాడుతూ కార్మికులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే, కష్టాలు తీరుతాయని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించార న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల సమస్యలు పరిష్కరించే ఆలోచన ఈ ప్రభుత్వంలో కనపడటం లేదని తక్కువ జీతాలు ఇచ్చి ఎక్కువ పనులు చేయించడం మాత్రం కనపడు తుందని ఈరోజు మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర రంగాల కార్మికులు కూడా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని మున్సిపల్ కార్మికులు ఎవరూ చేయలేని పనులు చేస్తున్నారని, అలాంటి వారికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు ఐక్యంగా పోరాడి, సాధించుకోవాలని పోరాటాలకు సిఐటియు అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, వై.కృష్ణమోహన్, ఎస్ వెంకయ్యల తోపాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జలదంకి బాబు, కార్యదర్శిగా వై.క్రాంతికుమార్, ఉపాధ్యక్షులుగా ఎల్.రాజ్యలక్ష్మి, పరుసు చిన్నమ్మ, జి.సినయ్య జాయింట్ సెక్రెటరీగా ఎం.పోలయ్య, పాముల సీనయ్య ట్రెజరర్‌గా ఎస్.కె షానావాజ్‌లు తోపాటు మొత్తం 24మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న కె.పెంచలనర్సయ్య



అధ్యక్షులుగా జలదంకి బాబు కార్యదర్శిగా క్రాంతికుమార్


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

## పేదల సంక్షేమానికే పి-4 విధానం

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

పేదల సంక్షేమానికి పి4 విధానం ఒక వరం లాంటిదని కోవూరు ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మైపాడు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎంఎల్‌ఎ ప్రశాంతి రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బకింగ్ హామ్ కెనాల్ పూడికతీత పనులను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం బంగారమ్మ తల్లి ద్వారబంధారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదమంత్రాలతో పండితులు కలెక్టర్ ఆనంద్‌కు ఎంఎల్‌ఎ ప్రశాంతి రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పి4 నిదానంలో భాగంగా దాతల సహాయంతో రూ.2 కోట్లతో బకింగ్ హామ్ కెనాల్ పూడికతీత పనులు, రూ.3 కోట్లతో కెనాల్ రోడ్డు పనులను ప్రారంభించడం సంతోషకరమన్నారు. మైపాడును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంలో కళ్యాణ్ రెడ్డి కృషి అభినందనీయమన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. బీచ్ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఏకోళ్ళు పవన్ రెడ్డి, చెంచు కిషోర్ బాబు, దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మత్స్యకార నాయకులు నాయకులు పామంజి నరసింహ, శ్రీహరికోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు పునరుద్ధరించండి..

- సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

రద్దు చేసిన వికలాంగుల పింఛన్లు తిరిగి పునరుద్ధరించాలని, ఆత్మకూరు సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు ఏరివేతలో భాగంగా, ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 46 పెన్షన్లు, మండల రూరల్ పరిధిలో 66 పెన్షన్లు రద్దు చేయడం జరిగింది. ఈ 66 నుండి 39పెన్షన్లు వృద్ధాప్య పెన్షన్లుగా మార్చిడి చేయబడింది. ఇందులో అనేకమంది అర్హత కలిగిన వారు ఉన్నారు. పెన్షన్ మీదనే ఆధారపడి జీవించే వికలాంగుల జీవితం ఈ రద్దు వల్ల ఆకలితో అలమటించే పరిస్థితి వస్తుంది. వికలాంగుల కడుపు కాల్చకుండా, వారి జీవితాలలో వెలుగులు నింపాలంటే, తొలగించిన పెన్షన్లు వెంటనే పునరుద్ధరించి వారిని ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ రద్దు కాబడిన పెన్షన్లు పునరుద్ధరించాలని, అలాగే రూరల్ పరిధిలో ఎంపిడిఒ రద్దు కాబడిన పెన్షన్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు.



## షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికలు

**ప్రజాశక్తి-సంగం** : మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి వి రమణయ్య బాల బాలికల జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా నుండి అనేక మంది క్రీడాకారులు హాజరై పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య హాజరై ఎంపిక పోటీలను ప్రారంభించారు. షూటింగ్ బాల్ పోటీలు హుషారుగా సాగాయి. పోటీలలో క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా షుటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి వి రమణయ్య మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి జట్లకు ఎంపిక చేస్తామని, వారికి బుచ్చిలో 20 రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం వచ్చేనెల 13, 14 తేదీలలో బుచ్చిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

## చిరంజీవి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-మర్రిపాడు** : సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షురాలు ఓరుగంటి ప్రమీల పాల్గొని కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నా జనసేన, కూటమి నాయ కులు తోడేటి నరేష్, చెన్న కృష్ణా రెడ్డి, జనసేన సీనియర్ నాయకులు జనార్ధన్ పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలపై అవగాహన

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : మండలంలోని గుంపర్లపాడు గ్రామపంచాయతీలో వారి పరిధిలోని కావలి ఎడవల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ డివిఎన్ శ్రీనివాసరావు బ్యాంకు సేవలపై న్యాచురేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు వినియోగదారులకు పిఎంజెబివై, పిఎంఎస్‌బివై, ఎపివై పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఎస్.మని శేఖర్, డివిజనల్ మేనేజర్ సురేష్, ఎఫ్‌ఎల్‌సి కోఆర్డినేటర్ రవిశంకర్, గుంపర్లపాడు గ్రామంలోని బ్యాంక్ వినియోగదారులు నాయకులు పాల్గొన్నారు.



## హెచ్‌ఐవి నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : విచ్చలవిడితనంతో అంటించుకునే వ్యాధి హెచ్‌ఐవి అని దీనివల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు గురవుతారని ఈ వ్యాధిపై సరైన అవగాహన విద్యార్థుల దశ నుండి అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సార్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వాణిశ్రీ అధ్యాపకులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సమస్త నిర్వాహకులు హెచ్‌ఐవి ద్వారా సంక్రమించే అనర్థాల గురించి వివరించారు. ప్రభుత్వ హెచ్‌ఐవి బాధితులకు ఉచితంగా మందులు అందజేస్తుందని వారిని విషయం గోప్యంగా ఉంచుతారని తెలిపారు. కార్యక్రమంలో సార్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఆర్డబ్ల్యూలు సుస్మిత, సునంద, పిఇలు ఉమామహేశ్వరి, సుగుణ, మహిమలూరు హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎస్‌బిఐ ఆధ్వర్యంలో 'జన సురక్ష'

**ప్రజాశక్తి-కావలి** : విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం కావలి పట్టణ స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో " జన సురక్ష " కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తిరుపతి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు ఎస్.బి.ఐ. డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి, నెల్లూరు ఆర్.బి.ఒ. ఎస్.బి.ఐ. రీజినల్ మేనేజర్ మురళి నాయక్, నెల్లూరు ఆర్.బి.ఒ. ఎఫ్.-1 మేనేజర్ పి.మల్లికార్జున్ బాబు, కావలి టౌన్ బ్రాంచ్ మేనేజర్ రమేష్‌లు పాల్గొని, వినియోగదారులకు జీవన్ సురక్ష పథకంను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రిసురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, వంటి పథకాలను ఉపయోగించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ పథకాలను కలిగి ఉంటే ఎద్దెనా అవసరం అయినపుడు ఏర్పడినప్పుడు, ప్రమాదం ఏర్పడినప్పుడు వెంటనే ప్రమాదబీమా కింద రూ.2లక్షలు అందజేస్తామన్నారు. అలాగే జన్‌ధన్ ఖాతాలు తెరచి, 10 సంవత్సరాలు పూర్తి అయిన వారందరు తప్పని సరిగా రీఈకెవైసి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్.బి.ఐ. చీఫ్ మేనేజర్ లోకనాథం, మెప్మా సిఎం ఎం.భారతి, వెలుగు ఎపిఎం పివి కృష్ణారావు, పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ కె.హరినారప రెడ్డి, విశ్వోదయ స్కూల్ హెడ్ మాస్టర్ పి.లక్ష్మిమాధవి, టి.శ్రీనివాసరావు, ప్రకాశ్‌రావు, స్టాఫ్ జ్యోష్న, భువనేశ్వరి, వెంకయ్య, కిరణ్, చక్రపాణి, బ్యాంకు ఖాతా దారులు, బ్యాంకు విశ్రాంత సిబ్బంది, పొదుపు మహిళలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.





## మాజీ ఎంఎల్‌ఎను అరెస్టు చేయాలి

**ప్రజాశక్తి-కావలి** : కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేకే, కావలిలో హత్య రాజకీయాలు చేస్తున్న మాజీ ఎంఎల్‌ఎను వెంటనే అరెస్టు చేయాలని సిరిపురం గ్రామ టిడిపి నాయకులు ఉప్పాల జాలారావు డిమాండ్ చేశారు. ఎంఎల్‌ఎ కృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి నిరసనగాశుక్రవారం సాయంత్రం కావలి రూరల్ మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో సిరిపురం, నారాయణపురం, గ్రామంలోని ప్రజలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పాల జాలారావు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి చెందిన అన్నవరం క్వారీలో మాజీ ఎంఎల్‌ఎ కొంతమందిని రౌడీలను, తన అనుచరులతో డ్రోన్ కెమెరా ద్వారా ఎంఎల్‌ఎ ఆచూకీ తెలుసుకొని హత్య చేయించాలనుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. కార్యక్రమంలో నాయుడు రాంప్రసాద్, గోవర్ధన్, పెంచల ప్రసాద్ నాయుడు, పరుసు తిరుపతి, ప్రసాదు, కోటేశ్వరరావు, రామారావు, రవి, సురేష్, హరి, మల్లికార్జున, ప్రవీణ్, రాఘవేంద్ర, మహేష్, జక్కంపూడి రవి, దయాకర్ నాయుడు, మహిళలు అంజలి, సులోచనమ్మ, శంకరమ్మ, సునీత, కోటమ్మ, టిడిపి నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అభివృద్ధిని ఎవరూ ఆపలేరు..

**ప్రజాశక్తి-బిట్రగుంట**

కావలి నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుపుతున్న శాసన సభ్యుడు దగ్గుమాటి కృష్ణారెడ్డిని ఎవరూ ఆపలేరని మాజీ సర్పంచ్, మాజీ బోగోలు కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు ప్యాట్రిక్ పేర్కొన్నారు. కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డిపై జరిగిన హత్యాయత్నంకు నిరసనగా శుక్రవారం బోగోలు బజార్లోని టిడిపి మాజీ ప్రధాన కార్యదర్శి మెతుకు వెంకట శేషయ్య ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాట్రిక్ మాట్లాడుతూ అన్నవరం దగ్గర ఉన్న కావ్య కృష్ణారెడ్డి క్వారీలో డ్రోన్ కెమెరాతో చిత్రీకరణలు చేయడం సబబు కాదని తెలిపారు. వ్యక్తిగత ఆస్తులపై వీడియోలు చిత్రీకరించడం అటుపైగా హత్యాయత్నానికి వ్యూహరచన చేయడం ప్రజా వ్యతిరేక చర్యని మండపడ్డారు. ప్రజాదరణ కలిగిన నాయకుడిన ఎవరేమీ చేయలేరని ఆయన చేస్తున్న మంచి కార్యక్రమాలే ఆయన్ను కాపాడుతున్నాయని తెలిపారు. మాజీ వైసిపి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు, ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కావ్య కృష్ణారెడ్డి కొద్దిపాటి కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. ఇకపై దుశ్చర్యలకు చేస్తే నియోజకవర్గ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ప్రధాన కార్యదర్శి మెతుకు వెంకట శేషయ్య, టిడిపి సీనియర్ నాయకులు దేవరాల తిరుపతి, కొల్ల రవీంద్రబాబు, గుండుబోయిన చెన్నయ్య, బచ్చు హరిబాబు, మద్దిలేటి సుందరం, అద్భుత రాజ్, మహిళ నాయకురాలు పార్వతి, మైనార్టీ నాయకులు షేక్ కరీం, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమస్థానంలో నిలవాలి..

**ప్రజాశక్తి-ఉదయగిరి**



అన్ని విషయాల్లో ఉదయగిరి మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయిలో ఉదయగిరి మండలం ఉండేలా చూడాలని ఎంపిడిఒ అప్పాజీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల స్థాయి సమీక్ష సమావేశంను విద్యాశాఖాధికారులు తోట శ్రీనివాసులు, టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల అధికారులు ఉల్లాస్ కార్యక్రమం, యుడైస్ ప్లస్, డ్రాప్ అవుట్స్ ఎన్‌రోల్‌మెంట్, అపార్ ఐడిలు రిజిస్ట్రేషన్, ఎస్‌ఆర్‌కెవిఎం అథెంటిఫికేషన్, మధ్యాహ్నం బడి భోజనం, ఎఫ్‌ఎ 1 మార్క్స్ ఎంట్రీ, స్కూల్ గ్రాంట్స్ తదితర అంశాలపై ప్రధాన ఉపాధ్యాయులతో వారు చర్చించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధికి కృషి : ఎంఎల్‌ఎ

**ప్రజాశక్తి-వింజమూరు**

నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు ఎర్రబెల్లిపాలెం చెరువు నుండి నేషనల్ హైవేకు టిప్పర్లతో గ్రావెల్లు తరలిస్తున్న ప్రాంతాన్ని ఎంఎల్‌ఎ కాకర్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇరిగేషన్ ఈఈతో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. 12వేల క్యూబిక్ మీటర్ల మట్టికి పర్మిషన్ తీసుకున్నారని ఇప్పటివరకు 8వేల క్యూబిక్ మీటర్లు మట్టిని తరలించారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సుమారు 145 చెరువులు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. చెరువులన్నింటికీ అధ్యక్షులు నియమించినట్లు వారి ద్వారా చెరువులను అభివృద్ధి జరుగుతుందన్నారు. చెరువులోనూ మట్టిని ఇష్టానుసారంగా గోతులు తవ్వకుండా పరిమిషన్ తీసుకొని సంబంధిత అధికారుల సమక్షంలో తరలించాలని కోరారు. వింజమూరు నుండి నందిగుంట వెళ్లే రహదారి పక్కన ఎడమ చేతి వైపు ఉన్న ప్రభుత్వ భూమిలో నోడా లేఅవుట్ ఏర్పాటుచేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూర్చి తద్వారా వింజమూరు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోడ నర్సారెడ్డి, సీనియర్ నాయకులు ఘనపురం సుదర్శన్ రెడ్డి, మంచిర్యాల శ్రీనివాస్ నాయుడు, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస యాదవ్, టిడిపి నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్

## 'అక్షర ఆంధ్ర' జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి-కావలి**

"అక్షర ఆంధ్ర" నూతన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పురపాలక సంఘం కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థలతో సమావేశమై ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన "అక్షర ఆంధ్ర" వయోజన విద్యా కార్యక్రమానికి వాలంటరీల కోసం ఆయన పిలుపునిచ్చారు. కావలి పట్టణంలోని 40 వార్డుల్లో వయోజనలకు విద్య నేర్పేందుకు ఈ ప్రోగ్రాంను ప్రారంభించారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ ప్రోగ్రామ్ ను ఉద్దేశించి మెప్మా కోఆర్డినేటర్ భారతి పలు విషయాలు చర్చించారు. కావలి పట్టణ పరిధిలో 4వేలమంది వయోజన నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఒక్కో వాలంటీరు 10మందికి విద్య నేర్పించి, నిరాక్షారాశ్యతను పారద్రోలాలని కోరారు. సమావేశంలో పట్టణంలోని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా కో - ఆర్డినేటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

## పారిశుధ్య పనులు చేపట్టాలి

**ప్రజాశక్తి-అనంతసాగరం**

మండలంలోని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. శుక్రవారం ఆయన కొత్తపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామపంచాయతీల్లో ఉన్న ట్రై సైకిల్స్ ద్వారా గ్రీన్ అంబాసిడర్లు కనీసం వారానికి రెండుసార్లు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి అందుబాటులో ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయడానికి కృషి చేయాలని తెలియజేశారు. అదేవిధంగా అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల సహకారంతో సచివాలయ సిబ్బందిని ప్రజలను సమన్వయపరచుకొని కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఎంపిడిఒవెంట డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్



## 68వ సారి 'కండ్లగుంట' రక్తదానం

**ప్రజాశక్తి-కావలి**

సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు శుక్రవారం రెడ్ క్రాస్ రక్తకేంద్రంలో 68వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మధుబాబునాయుడును పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు, రక్తకేంద్రం సిబ్బంది సత్కరించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ మాట్లాడుతూ మధుబాబు నాయుడు విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు రక్తదానం చేయడం ప్రారంభించి, ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నారన్నారు. కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో అందరి కంటే ఎక్కువసార్లు రక్తదానం చేసినమధుబాబు నాయుడు యువతకు ఆదర్శ ప్రాయుడిగా, రక్తదానానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని అభినందించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, పాలక మండలి సభ్యులు, టీం సేవియర్స్ అధ్యక్షుడు యన్ ప్రణీత్,రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ టిరమ్య, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రార్థనలు

**ప్రజాశక్తి - ఉదయగిరి**



కావలి శాసన సభ్యులు కావ్య కృష్ణారెడ్డి క్షేమం కోరుతూ ట్రస్ట్ సభ్యులు పార్టీ నాయకులు సన్నిహితుడు సికిందర్ ఆధ్వర్యంలో శ్రీ అబ్దుల్ ఖాదర్ ఖాన్ షావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ కావ్య కృష్ణారెడ్డికి రౌడీలు గుండాల నుండి ఎటువంటి హాని కలగకూడదని ఉండేందుకు పట్టణ నాయకులు ట్రస్ట్ సభ్యులతో ఈ ప్రార్థనలు నిర్వహించామన్నారు. అన్నవరం క్వారీలో డ్రోన్లు మారణాయుధాలు దొరకడం కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి కోసమే ప్రత్యర్థులు ఇదంతా చేస్తున్నారని దైవం ఆశీస్సులు ఉన్నంతవరకు ఎంఎల్‌ఎ కృష్ణారెడ్డికి ఎటువంటి ప్రాణహాని ఉండదన్నారు. కావలి అభివృద్ధి ప్రదాత దానకన్నుడు విద్యావంతుడు కావ్య కృష్ణారెడ్డి లాంటి ఎంఎల్‌ఎ దొరకడం కావలి ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో మాభాష లాడెన్, సున్నాని సంధాని, అలీ మెహర్, సుభాని, రాజా, జమీర్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

## రైతులకు శిక్షణ

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

మండలంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ఖరీఫ్ సీజనులో మండలంకు (వరిపంటకు సంబంధించి) మంజూరైన 20 పంట కోత ప్రయోగాలను రైతుల పొలంలో ఎలా నిర్వర్తించాలో సహాయ గణాంక అధికారి అయిన రాజేంద్రప్రసాద్ శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ అధికారి పంట కోత ప్రయోగాల ప్రాముఖ్యతను తెలియజేశారు. మండలంలో వున్న ప్రతీరైతు (పంట వేసిన లేక పంట వేయకపోయినా కూడా ప్రతీ సర్వే నంబరును అలాగే ఉద్యానపంటలను కూడా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

# అనుమతులు తప్పనిసరి

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండలంలో 27వ తేదీన వినాయక చవితి ఉత్సవాలకు పోలీస్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ ఎం.రఘునాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించే వారు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసే ప్రాంతం, నిమజ్జనం చేసే ప్రాంతం, నిమజ్జన సమయం, ఎన్ని రోజులు విగ్రహాన్ని పెడతారు, కమిటీ సభ్యులు వివరాలతో అనుమతులు పొందాలన్నారు.


వరికుంటపాడు ఎస్ఐ

**ప్రజాశక్తి-మర్రిపాడు** : రానున్న వినాయక చవితి సందర్భంగా ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం, సోమశిల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఎవరైనా వినాయకుని బొమ్మ పెట్టాలన్నా, నిమజ్జనం చేయాలన్నా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని ఆత్మకూరు సిఐ గంగాధర్ రావు తెలియజేశారు. ఎలక్ట్రికల్ బిల్లు తీసుకొని మైక్ పర్మిషన్ కొరకు వినాయక చవితి మండపం కమిటీ మెంబర్లు పోలీస్ స్టేషన్‌లో అర్జీ ఇస్తే డిఎస్‌పి కార్యాలయానికి పంపుతామన్నారు. అనంతరం పరిశీలించి అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు.

**ప్రజాశక్తి-సీతారాంపురం** : వినాయక చవితి పండుగ సందర్భంలో గ్రామాలలో వినాయక స్వామి విగ్రహాలు మండపాలను ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలి ఎస్ఐ శివకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాలలో వినాయక స్వామి విగ్రహాల మండప పాలను ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా నియమాలను, పాటించాలని ఎస్ఐ శివ కృష్ణారెడ్డి తెలిపారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : వినాయకచవితి పర్వదినం సందర్భంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఇన్‌ఛార్జి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి, ఆత్మకూరు ఎస్ఐ జిలానీలు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు సర్కిల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వేమారెడ్డి మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్ స్కానర్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. నిర్వాహకులు పోలీసులు సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.


## సబ్సిడీతో డ్రోన్ పరికరం

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

అనుమసముద్రం రైతుసేవా కేంద్రం పరిధిలోని 2వ గ్రూపు జ్యోతి రైతు సేవా సంఘానికి 80శాతం సబ్సిడీతో కెనరా బ్యాంకు మేనేజర్, ఎఎస్‌పేట వారి సహకారంతో డ్రోన్ పరికరం మంజూరు చేసింది. కార్యక్రమంలో డ్రోగో డ్రోన్ కంపెనీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ యోగేశ్వర్, గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య, మునెమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నియంత్రించాలి

**ప్రజాశక్తి-కావలి**



సమాజంలో తెలిసీతెలియని వయసులో పిల్లలకు బాల్య వివాహాలు నిర్వహించడం ద్వారా వివాహ వ్యవస్థ బలహీన పడుతుందని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాలకొండా రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న బాల్య వివాహాలను నియంత్రించి బాల్య వివాహాలను నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గిరిజన కాలనీలో పేదల నివసించే ప్రాంతాల్లో తెలిసి తెలియని వయసులో వివాహాలు నిర్వహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దానికి ముఖ్యకారణం నిరక్షరాస్యత, పేదరికం వల్ల ఇలా జరుగుతుందని వ్యక్తం చేశారు. ఆడపిల్లలకైతే 18 సంవత్సరాలు నిండాలని, బాలురుకైతే 21 సంవత్సరం వచ్చేవరకు ఆగి, తదనంతరం వివాహాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఎవరైనా సరే బాల్య వివాహాలు నిర్వహించిన ప్రోత్సహించిన చట్టరీత్యా నేరం జైలు శిక్ష కూడా ఉంటుందని తెలిపారు. పౌర సంస్థలు ప్రజాప్రతినిధులు సమాజం ప్రజలను చైతన్యపరిచి బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త జివి శారద, మహిళలు బి.రాములమ్మ ఎస్.సుభాషిని, ఎన్ తిరుపతమ్మ, కే అనిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**In the Court of the Principal Civil Judge : Nellore**
**O.S.No. 577 / 2023**

**Chodavaram Rajasekhar** - Plaintiff
Vs
**Kavali Varaprasad @ Varaprasada Rao** - Defendant

**Notice to Defendant**

**Kavali Varaprasad @ Vara Prasada Rao,** S/o **Venkaiah,**
Correspondent to Sripathi School,
R/o Sumvruddi Nilayam, D.No.26-3-331,
1st Cross Road, Jyothi Nagar,
Vedayapalem, Nellore.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో ప్రామిసరీ నోట్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే22-9-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**గోడా సురేష్,** M.A., M.L.,
వాది తరపు అడ్వకేటు, నెల్లూరు.

**In The Court of The 1 Addl. Senior Civil Judge : Nellore**
**I.P.No. 54 / 2025**

**Kakuluru Kamal Kumar** - Petitoner
Vs
1. **Devaraj**
2. **Jonna Krishnasagar**
3. **Kakuluru Vasantha Kumar**
4. **Seemakurthi Hemakumar**
5. **Kakuluru Mahesh**
6. **Chiranjeevi**
7. **Harish**
8. **Sunandh Kumar** - Respondents

**జనరల్ నోటీసు**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటిషనరు అయిన **Kakuluru Kamal Kumar** దివాలా తీసినందున ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టులో **I.P. No. 54/2025** ను పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు I.P. పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల **తేది: 28-10-2025** న వాయిదా వేసియున్నారు. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసింది యావన్మందికి తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
**ఎస్.కార్తీక్,** M.A., L.L.B.,
పిటిషనర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

## మానవత్వం చాటిన న్యాయవాది

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్**



నగరంలో ప్రమాదవశాత్తు గాయాల పాలైన అనిల్ కుమార్ ను శుక్రవారం, మానవతావాది, సామాజికవేత్త, న్యాయవాది ఇర్ల వెంకటరమణయ్య స్థానిక జయభారత్ వైద్యశాలలో చేర్పించి మానవత్వం చాటారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య మాట్లాడారు. అనిల్ కుమార్ నడవలేని స్థితిలో తీవ్ర గాయాలతో తనకు నగరంలో కనిపించాడని తెలిపారు. తాను హుటాహుటిన వైద్యశాలలో చేర్పించి, అతనికి తగు వైద్యం అందించేందుకు వైద్యులకు జరిగిన విషయాన్ని విన్నవించినట్లు తెలిపారు. దాంతో వైద్యులు అనిల్ కుమార్ కు తగు వైద్యాన్ని అందించి సేవ చేశారని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దుక్పథంతో జీవించాలని కోరారు. మానవ సేవే మాధవ సేవ అనే దృక్పథంతో ప్రజలు మెలగాలని కోరారు. కక్షపూరితమైన స్వభావాలు లేకుండా మంచి పౌరులుగా, ప్రతి ఒక్కరు సమాజంలో జీవించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. న్యాయవాది జే.విజయ్ కుమార్, రణవత్ లోకేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు మహిళ మాజీ అధ్యక్షులు భార్గవమ్మ మృతి

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

తోటపల్లిగూడూరు మండల తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకురాలు శుక్రవారం మృతి చెందారు. వరకవిపూడి గ్రామానికి చెందిన భార్గవమ్మ గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో భార్గవమ్మను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వైద్యశాలలో చేర్పించారు. ఆమె ఆరోగ్యం కుదుట పడకపోగా మరింతగా విషమించింది. భార్గవమ్మ పార్థివ దేహాన్ని టీడీపీ మండల అధ్యక్షులు కొణతం రఘుబాబు, సొసైటీ చైర్మన్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## పదవికి వన్నెతెచ్చేలా పనిచేయాలి.

**ప్రజాశక్తి కొడవలూరు**

పార్టీలో పదవులు ఇచ్చినవారు పెత్తనం చెలాయించకుండా ఇచ్చిన పదవులకు వన్నెతెచ్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శుక్రవారం కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం పిఎస్ఆర్ కళ్యాణ మండపంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్లు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. త్రీ సభ్య చైర్మన్ లు చే ప్రమాణ స్వీకారం చేయించారు. గుండా లమ్మ పాలెం సొసైటీ చైర్మన్ గా వినీల్ రెడ్డి యల్లాయపాలెం సొసైటీ చైర్మన్గా ఏకొల్లు వంశీధర్ రెడ్డి తలమంచి సొసైటీ చైర్మన్గా పిట్టు సూర్యనారాయణ లను ఏకగ్రీవం గా ఏనుకోవటం జరిగిందన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెల్టా ప్రాంతమైన కోవూరు ప్రాంతంలో సహకార సంఘాలు రైతుల కు అండగా నిలిచి వారికి అందుబాటులో ఉండాలన్నారు. ఈ సంఘాల ద్వారా విత్తనాలు,ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందించాలన్నారు. సొసైటీలలో ఎలాంటి సమస్యలు లేకుండా అభివద్ధి కి కషి చేయాలి అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల పక్షపాతి అని రైతుల సంక్షేమ కోసం ముందుండి సహాయ సహకారాలుఅందిస్తున్నారన్నారు. అదేవిధంగా సొసైటీ సభ్యులుగా ఎన్నికైన వారు చైర్మన్లు పక్షపాతం లేకుండా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## నిడిగుంట అరుణ గ్యాంగ్ పై మరో కొరడా

# మరో ముగ్గురు నిందితులు అరెస్టు

**ప్రజాశక్తి-కోవూరు**

నెల్లూరు జిల్లా లేడీ డాన్‌గా పేరు తెచ్చుకున్న నిడిగుంట అరుణపై పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఆమె కేసుల్లో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు, శుక్రవారం మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో అఫ్సర్ ,ముసబీర్ ,గణేష్ లు ఉన్నారు ..అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. ఈకేసుకు సంబంధించి ఇప్పటికె అరుణతో పాటు ముగ్గురును అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించి ఉన్నారు వీరితో మొత్తం ఏడుగురిని అరెస్ట్ చేసిఉన్నారు. అరుణ గ్యాంగ్ అక్రమ కార్యకలాపాలు, భూకబ్జాలు, దౌర్జన్యాలు, భయపెట్టి డబ్బులు వసూలు వంటి ఆరోపణలపై జిల్లా వ్యాప్తంగా కేసులు నమోదయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో అల్లకల్లోలం సష్టిస్తున్న ఈ గ్యాంగ్‌పై స్థానికుల నుంచి పిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.అధికారుల సమాచారం ప్రకారం అరెస్టయిన వారు గ్యాంగ్‌లో కీలకంగా పనిచేస్తూ, భూవివాదాలు, వసూళ్లలో నేరుగా పాలుపంచుకున్నట్లు తేలింది. పోలీసులు మిగిలిన సభ్యులపై కూడా గాలింపు కొనసాగిస్తున్నారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**ప్రజాశక్తి-కోవూరు**

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అన్నదాతలు సంతోషంగా ఉన్నారని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుల జీవితాల్లో మరింత వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని శాంతినగర్లో ఉన్న పడుగుపాడు ప్రాథమిక సహకార సంఘం ఆవరణంలో శుక్రవారం పడుగుపాడు, ముదివర్తి ప్రాథమిక వ్యవసాయ న హకార సంఘాల పాలకవర్గాల ప్రమాణస్వీకారం మనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార సంఘాల్లో చైర్మన్లుగా, డైరెక్టర్లుగా సేవాభావం రైతులకు మేలు చేయాలనే తపన ఉన్న వారినే పాలకవర్గాల్లో ఎంపిక చేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక చేయూతనిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు వక్షపాతి అని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే రైతు బంధు పథకాన్ని తొలగించిందని, దానిని మరలా ఈ కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరించి నామమాత్రపు వడ్డీతో అన్నదాతలకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. గత రబీ సీజన్లో ధాన్యం సేకరణ చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో కూడా రైతుల నుంచి ధాన్యం సేకరణ చేయాలని ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. పడుగుపాడు సొసైటీ అభివద్ధికి గతంలో చైర్మన్ గా ఉన్న జెట్టి రాజగోపాల్రెడ్డి ఎనలేని కషి చేసి సొసైటీని మరింత అభివద్ధిలోకి తీసుకువచ్చారన్నారు. సహకార సంఘాల పాలకవర్గాలు విత్తనాలు, ఎరువుల సరఫరాతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి రైతులను ఆదుకునే బాధ్యత వారిపై ఉందన్నారు. ఇటీవల కాలంలో ఇనమడుగు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రగతి పథంలో దూసుకుపోతున్న పడుగుపాడు సొసైటీ మరింత అభివద్ధి చెంది రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చేలా పాలకవర్గాలు కషి చేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, సొసైటీ చైర్మన్లు నాగారెడ్డి శ్యామ్ సుందర్రెడ్డి, ముదివర్తి సొసైటీ చైర్మన్ తన్నీరు రాజయ్యలు ప్రసంగించారు. అనంతరం నూతన పాలకవర్గాల చేత ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్రెడ్డి, జొన్నవాడ దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్రెడ్డి, గ్రామ సర్పంచ్లు విజయలక్ష్మి, అమరావతి, ఎంపీపీ టి. పార్వతి, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్ రెడ్డి, గాదిరాజు అశోక్ కుమార్, తాడిపర్తి విజయకుమార్రెడ్డి, చెంబేటి పెంచలయ్య, శ్రీనివాసులు నాయుడు. రాధాకష్ణ, బాల్ రవి, నాటకరాణి వెంకట్, సుధాకర్, చింతలపూడి పెంచలయ్య, పురుషోత్తం, వేగూరు సుబ్బా నాయుడు, కరేటి శ్రీనివాసులు,, వడుగుపాడు సొసైటీ సీఈవో గోవర్ధన్రెడ్డి, ముదివర్తి సొసైటీ సీఈవో సురేష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్రెడ్డి, నాగరాజు, బెల్లంకొండ విజయకుమార్, టవికుమార్, కూటమి నేతలు టి. సుబ్బారావు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

**నాగారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డికి సన్మానం**

పడుగుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ గా ఎన్నికైన నాగారెడ్డి శ్యాంసుందర్ రెడ్డిని టిడిపి నాయకులు నాటకరాణి వెంకట్ శాలువాతో సన్మానించారు. నాగారెడ్డి శ్యాంసుదర్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



సన్మానిస్తున్న టిడిపి నాయకులు వెంకట్

# ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**ప్రజాశక్తి-కోవూరు**: కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతిగౌడ్ మాట్లాడుతూ ఈ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు ఉన్నారని, వారి సేవలను కోవూరు ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి పలు విషయాలను ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, కమిటీ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, వంశీకృష్ణ, నాగమణిలు సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. రానున్న రోజుల్లో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధులతో ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆస్పత్రిలో వైరింగ్ కూడా ఇబ్బందిగా ఉందని, దానిని కూడా మార్చేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు లీలావతి, వంశీకృష్ణ, సలావుద్దీన్, మైనుద్దీన్, హెడ్ నర్స్ ప్రసూనలత, ఫార్మాసిస్ట్ నరసింహులు, ల్యాబ్ అసిస్టెంట్ కిషోర్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణం లో రోగులను చూసేందుకు వచ్చే బంధువులకు ఒక ప్రత్యేక షెడ్డు ఆస్పత్రి నిధులతో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు, ఆస్పత్రి కమిటీ సభ్యులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

## సమస్యలను అధికారులకు తెలపండి

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం**: సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగితే వారికి సహకరించి సమస్యలు తెలియజేయాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు.బుచ్చిరెడ్డిపాలెం పట్టణం 20వ వార్డు రామచంద్రపురం ఎస్టి కాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా 432ఎస్టీ కాలనీ ఉన్న రామచంద్రపురం గ్రామాన్ని అన్ని విధాల అభివద్ధి చేస్తానని ఆమె తెలియజేశారు. ఇటీవల రామచంద్రపురం గ్రామాన్ని దత్తత తీసుకున్న వేమిరెడ్డి దంపతులు ఆ గ్రామ యోగక్షేమాలను తెలుసు కునేందుకు ఆ గ్రామానికి రావడం జరిగిందన్నారు. గ్రామ ప్రజలు సచివాలయ సిబ్బందికి, అధికారులకు సహకరించి కూటమి ప్రభుత్వం అందించేసంక్షేమ పథకాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ డి బాలకష్ణ, వార్డు కౌన్సిలర్ కత్తి శ్రీదేవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన దృశ్యం

## అందుబాటులో మెప్మా పథకాలు

**ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్**

మెప్మా పథకాలు ప్రజలకు అందుబాటులోకి మిషన్ డైరెక్టర్ శ్రీ తేజ భరత్ తీసుకువచ్చారని మెప్మా పీడీ బి. లీలారాణి తెలిపారు. శుక్రవారం జిల్లా మెప్మా కార్యాలయంలో ఆర్పీలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మెప్మా ప్రగతి అన్ని రాష్ట్రాలకు ఒక ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. ఈ మధ్యకాలంలో చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్ అర్బన్ మార్కెట్, తృప్తి క్యాంటీన్, రాపిడో, హోమ్ ట్రయాంగిల్, అరకు కాఫీ, సూర్యధర్ పీఎం అయిస్మాన్ భారతి, ఎమ్మెల్సీ అవని బ్రాండ్లతో మెప్మా ప్రగతిని ముందుకు తీసుకుపోతున్నారని సాహస ప్రోగ్రాం రేపు విజయవంతంగా చేయాలని కోరారు. మెప్మా ఆర్పిలకు ట్యాబులు ఇచ్చినందువల్ల అన్ని కార్యక్రమాలు డిజిటలైజేషన్ చేశారన్నారు. తద్వారా ఎస్ఎస్పి ప్రొఫైలింగ్, ఎస్ ఎల్ ఎఫ్ ప్రొఫైలింగ్ ఆడిట్ అన్ని కూడా పారదర్శకత జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమాలు అమలు జరుపుటలో ఆర్పీలు కీలకపాత్ర వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐబి అంకయ్య, ఏఓ సుధాకర్, ఎస్ ఎస్ కాంతయ్య, సిఎంఎం కవిత, జరీనా, సి ఓ లు, ఆర్పీలు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాశక్తి-కోవూరు**

పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీడీపీఓ శారద అన్నారు. కోవూరులోని ప్రాజెక్టు కార్యాలయంలో బుచ్చి, విడవలూరు మండలాలకు సంబంధించిన ఆయాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆయాలకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి కేంద్రంలో మెనూ చార్టు గోడకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేంద్రాల వేళలను తప్పక పాటిస్తూ పిల్లలను తీసుకురావడమే కాకుండా సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

## బాధ్యతగా విధులు నిర్వహించండి

**ప్రజాశక్తి-కోవూరు**

మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇటీవల తొలగించిన పింఛన్లలో ఏమైనా అర్హత ఉంటే అటువంటి వాటి వివరాలను వెంటనే పూర్తిస్థాయిలో నమోదు చేసుకుని కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద వారి వారి పరిధిలో హౌసింగ్‌కు పెంఛన్లకు సంబంధించి ఎవరు దరఖాస్తు చేసుకున్నారనే వివరాలు తప్పక ఉండాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి ఉదయం, సాయంత్రం రెండుపూటలా ఫేస్ యాప్లో తప్పక నమోదు చేయాలన్నారు. విధి నిరాహణలో నిరక్ష్యం వహించడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సందర్భంగా సచివాలయాల వారీగా ప్రగతిపై సమీక్షించారు.